క్లుప్తంగా

రాగి జావతో రక్తహీనత నివారణ



రాగి జావను పరిశీలిస్తున్న ఎంఈఓలు

గజపతినగరం: పిల్లల్లో రక్తహీనత నివారణ, పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు 'జగనన్న గోరుముద్ద' పథకంలో భాగంగా రాగిజావ అందిస్తున్నట్లు ఎంఈఓలు విమలమ్మ, చక్రధర్ తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాలను గురువారం వారు సందర్శించారు.రాగిజావను, మధ్యాహ్నభోజన వంటలను రుచి చూశారు. ప్రతీ విద్యార్థికి రాగి జావ అందించాలని వంట నిర్వాహకులకు సూచించారు. వారి వెంట సీఆర్పీ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

సచివాలయంలో తనిఖీలు



స్పందన అర్జీల వివరాలను కంప్యూటర్‌లో పరిశీలిస్తున్న ఎంపీడీఓ పట్నాయక్

వేపాడ: బొద్దాం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ బి.ఎస్.ఎన్.కె.పట్నాయక్ గురువారం తనిఖీలు నిర్వహించారు. స్పందన వినతులు, వాటి పరిష్కారం తదితర వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసిందీ లేనిది పరిశీలించారు. అనంతరం ఆయన సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని, ప్రజాసమస్యలపై తక్షణం స్పందించాలని సూచించా రు. జగనన్న సురక్ష కార్యక్రమం లో అందిన అర్జీలకు పరిష్కారం చూపడంతో పాటు ధ్రువపత్రాలు మంజూరులో సిబ్బంది సేవలను సిబ్బందిని అభినందించారు.

న్యాయవాదులు విధుల బహిష్కరణ



కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

గజపతినగరం: స్థానిక ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జూనియర్ సివిల్ కోర్టులో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డలో న్యాయవాది జి.శ్రీనివాసరావుపై కక్షిదారులు ఇటీవల దాడిచేసి గాయపరిచిన ఘటనకు నిరసనగా విధులను బహిష్కరించామని బార్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదులపై దాడులు సరికాదని అన్నారు.

162 రేషన్ కార్డులు మంజూరు

బొండపల్లి: మండలానికి కొత్తగా 162 రేషన్ కార్డులు మంజూరయ్యాయని పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ రవి శంకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో రేషన్ కార్డు కోసం కొత్తగా అందిన దరఖాస్తులను పరిశీలించి, వాటిలో అర్హత ఉన్న వారికి కార్డులు మంజూరు చేశామని, వీటిని ఈ నెలాఖరున లబ్ధిదారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ఇంకా మండలంలో అర్హత ఉన్నవారు ఎవరైనా ఉంటే సంబంధిత సచివాలయాల్లో ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ ప్రతినిధులు

చీపురుపల్లి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంకటేష్ కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ధర్నా చేశారు. తహసీల్దార్ ఎం.సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో తిరిగి మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభించాలని కోరారు. అలాగే ఖాళీగా ఉన్న శాశ్వత అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభంరోజే పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తాం

గజపతినగరం: ప్రతి ఇంటికీ వెళ్లి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, 9 ఏళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను 'ఘర్- ఘర్ సంపర్క్ అభియాన్' కార్యక్రమం ద్వారా ప్రజలకు వివరిస్తామని గజపతినగరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి దేవర ఈశ్వరరావు తెలిపారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ పాలనపై ప్రజలంతా సంతృప్తిగా ఉన్నారన్నారు. అనంతరం 'ఘర్- ఘర్ సంపర్క్ అభియాన్' కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు.

సీఎం జగన్ రైతు పక్షపాతి

- ఉత్తరాపల్లి ఆర్బీకే, గాంధీనగర్‌లో కమ్యూనిటీ భవనాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కడుబండి



కొత్తవలస: ఉత్తరాపల్లి ఆర్బీకే భవనాన్ని రైతుతో కలిసి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుపక్షపాతి అని, రైతు సంతోషంగా సేద్యం చేసుకునేందుకు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ఉత్తరాపల్లి గ్రామంలో రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం(ఆర్బీకే) భవనాన్ని, అలాగే గాంధీనగర్ గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిధులు రూ.4.90 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ భవనాన్ని రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబుతో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. ఉత్తరాపల్లిలో నిర్వ హించిన సభలో ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా విస్మరించిదని అన్నారు. రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు పూర్తిస్థాయిలో రుణాలను మాఫీ చేయకుండా రైతులను వంచించారని గుర్తు చేశారు. సీఎం జగన్ వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో ఆర్బీకేలు ఏర్పాటు చేసి రైతులకు విత్తనాలు, ఎరువులు అందిస్తున్నారని అన్నారు. గతంలో విత్తనాలు, ఎరువుల కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేదని, ప్రస్తుతం రైతులకు ఆ ఇబ్బందులు తొలగాయన్నారు. ఆర్బీకేల ద్వారానే ధాన్యం కొనుగోళ్లు చేపడుతు న్నామని చెప్పారు. రైతు భరోసా పథకం ద్వారా రైతన్నలకు పెట్టుబడి సాయం, సున్నా వడ్డీ రాయితీ అందించడంతో పాటు వ్యవసాయ, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలను రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. పంట నష్టపోయిన రైతులకు పారదర్శకంగా పరిహారం చెల్లిస్తున్నామని వివరించారు. నాయుడుబాబు మాట్లాడుతూ సమాజంలో ఉన్న ప్రతీ ఒక్కరికి ఏది అవసరమో గుర్తించి వారి అవసరాలు తీరేలా వివక్ష లేకుండా పథకాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీడీఓ వై.పద్మజ, తహసీల్దార్ శ్రీనివాసమిశ్రా, పంచాయతీరాజ్ డీఈ సీహెచ్ స్వామినాయుడు, ఎంపీపీ ఎన్.గోపెమ్మ, పీఏసీఎస్ చైర్మన్ గొరపల్లి శివ, సర్పంచ్ సింగంపల్లి వెంకటలక్ష్మి,ఎంపీటీసీ మూనూరు శివప్రసాద్, వైఎస్సార్‌సీపీ నాయకులు శింగంపల్లి గణేష్, లగుడు వామ తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంతోషమే లక్ష్యం



శృంగవరపుకోట: కొత్తచామలాపల్లిలో వృద్ధురాలికి సీఎం జగన్ సందేశ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కడుబండి

శృంగవరపుకోట: రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మామిడిపల్లి గ్రామ సచివాలయం పరిధిలో గురువారం సాయంత్రం 231వ రోజు 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి గడపకూ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతీ కుటుంబానికి పథకాల ద్వారా కలిగిన లబ్ధిని వివరిస్తూ, సీఎం జగన్ పంపించిన సందేశ పత్రాన్ని ప్రజలకు అందజేశారు. స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అమ్మ ఒడి, చేయూత, గోరుముద్ద, విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా కానుక, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, ఆరోగ్యశ్రీ, పెన్షన్‌లు, పేదలందరికీ ఇళ్లు, ఇలా అనేక పథకాలు అమలు చేస్తున్న జగనన్నను ఆశీర్వదించాలని ప్రజల ను కోరారు. సర్పంచ్ చిట్టిపోలు మంగ, ఎంపీటీసీ జి.సన్యాసప్పుడు, వైస్ సర్పంచ్ కె.గంగేశ్వరరావు, స్టేట్ ఫోక్ అకాడమీ డైరెక్టర్ వి.రాంబాబు, మండల జేసీఎస్ ఇన్‌చార్జి వి.సతీష్, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్, ఏఎంసీ డైరెక్టర్ డి.పార్వతి, చామలాపల్లి సర్పంచ్ జె.సూర్యారావు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, సీతారాంపురం సర్పంచ్ ఎం.చిన్నంనాయుడు, ఎంపీటీసీ కె.అప్పయ్య, నాయకులు జి.హైడితల్లి, మోడి కాశీవిశ్వనాథం, రంది అనంత్, ఎం.సోంబాబు, ఉల్లి శంకర్, అప్పల సత్యం, అల్లు మహాలక్ష్మినాయుడు, చింతల నారాయణమూర్తి, వి.జగదీష్, మామిడి శంకర్ పాల్గొన్నారు.

దావాలపేటలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్యశిబిరంలో సేవలందిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: గజపతినగరం గ్రామ సచివాలయం -2 పరిధిలోని దావాలపేట గ్రామంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ ఆధ్వర్యంలో గురువారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఏర్పాటు చేసిన శిబిరంలో 73 మందికి వివిధ వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు.వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వైరస్ వల్ల కండ్ల కలకల వ్యాధి వ్యాప్తి చెందుతోందని, సొంత వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించి మందులు వాడాలని వైద్యాధికారి సలహా ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలను సందర్శించి విద్యార్థులు, చిన్నారులకు వైద్య తనిఖీలు చేసి ఆరోగ్య సూత్రాలపై అవగాహన కల్పించారు. ఎంఎల్‌హెచ్‌పీ శివానీ, ఆరోగ్య కార్యకర్త బేగం, ఆశ కార్యకర్తలు గాయత్రి, హేమ తదితరులు పాల్గొన్నారు.

దశపత్ర కషాయం తయారీపై అవగాహన



కషాయం తయారీపై అవగాహన కల్పిస్తున్న వెంకటరావు

వేపాడ: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా వరి పంటను ఆశించే తెగుళ్ల నివారణకు ఉపయోగించే దశపత్ర కషాయం తయారీపై కె.జి.పూడి క్లస్టర్ పరిధి రామస్వామిపేటలో సుస్థిర వ్యవసాయ కేంద్రం రీజనల్ కో-ఆర్డినేటర్ వెంకటరావు రైతులకు గురువారం ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. 200 గ్రాముల పసుపు, కిలో అల్లం, కిలో పచ్చిమిర్చి, కిలో వెల్లుల్లి, రెండు కిలోల పొగాకు కాడలు, రెండు కిలోల బంతి ఆకులు, వేప, కాగు, సీతాఫలం, నేపాలం, జిల్లేడు, బొప్పా యి, ఆముదం, ముషిడి, నేలం, కుంకుడు, కసివింద తదితర రకాలను కలిపి కషాయం తయారు చేశారు. ఈ కషాయం ఆరునెలల పాటు నిల్వ ఉంటుందని, వరిని ఆశించే తెగుళ్ల నివారణలో సమర్థవంతంగా పనిచేస్తుందని వెంకటరావు వివరించారు. వీఏఏ శివ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్.కోట జగనన్న కాలనీకి రూ.2.50 కోట్లు



జగనన్న కాలనీలో బోర్లు పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో శాశ్వత మంచినీటి వసతి కల్పించేందుకు రూ.2.50 కోట్లతో ప్రతిపాదనలు చేసినట్లు గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్)అధికారులు తెలిపారు. జగనన్న కాలనీని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఉమాశంకర్, ఈఈ రాజన్, డీఈఈ గోవిందరావు గురువారం సందర్శించారు. ప్రస్తుతం కాలనీలో ఉన్న బోరు బావుల శాంపిల్స్ సేకరించారు. కాలనీలో రెండు ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణం కోసం అనువైన స్థలాలను పరిశీలించారు. రూ.2.50కోట్లతో 60వేల లీటర్ల నీటి సామర్థ్యంతో రెండు ట్యాంకు ల నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్టు చెప్పారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్టు వారు చెప్పారు. కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. వారి వెంట ఏఈఈ సత్యకిషోర్, సిబ్బంది ఉన్నారు.

వీఆర్ఏల రిలే నిరాహార దీక్షలు



చీపురుపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రిలేనిరాహార దీక్ష చేస్తున్న వీఆర్ఏలు

చీపురుపల్లి/మెరకముడిదాం/ కొత్తవలస /లక్కవరపుకోట/ శృంగవరపుకోట: తమ సమస్యలు పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని గ్రామ రెవెన్యూ సహాయ కులు(వీఆర్ఏ) కోరారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపుమేరకు చీపురుపల్లి,మెరకముడిదాం,కొత్తవలస,లక్కవరపుకోట, శృంగవరపుకోట తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో ఆయా మండలాల వీఆర్ఏలు గురువారం రిలేనిరాహార దీక్షలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అర్హత ఉన్న వీఆర్ఏలకు వీఆర్ఓలుగా పదోన్నతి కల్పించాలన్నారు. ప్రభుత్వ పథకాలన్నీ వర్తింపజేయాలని కోరారు. 65 ఏళ్లు దాటిన వీఆర్ఏలు మృతి చెందితే వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు. ఫేస్ యాప్ హాజరు నుంచి మినహాయించాలని, మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, గ్రాట్యూటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. వీఆర్ఏల సంఘ ప్రతినిధులు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి

దత్తిరాజేరు: వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం పంచాయతీ కార్యదర్శులను గురువారం ఓ ప్రకటనలో ఆదేశించారు. అన్ని గ్రామాల్లోనూ వీధి కాలువల్లో పూడికలు తీయించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్త,చెదారం తొలగించాలని సూచించారు. అలాగే తాగునీటి వనరుల్లో క్లోరినేషనన్ చేయాలని పేర్కొన్నారు.

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న లక్ష్మీనరసింహస్వామి

జామి: కుమరాం గ్రామంలోని ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు వరప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాల సరఫరా



గజపతినగరం: ఎండీయూ వాహనాల ద్వారా పుస్తకాల సరఫరాను ప్రారంభిస్తున్న ఎంఈఓలు విమలమ్మ, చక్రధర్



వేపాడ: ఎండీయూ వాహనాల ద్వారా పాఠ్యపుస్తకాల పంపిణీని ప్రారంభిస్తున్న విద్యాశాఖ సిబ్బంది

గజపతినగరం: మండలంలోని 56 ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా రెండో సెమిస్టర్ పాఠ్య పుస్తకాలను ప్రభుత్వం అందజేసిందని మండల విద్యాశాఖ అధికారులు విమలమ్మ, చక్రధర్ తెలిపారు. స్థానిక బాలుర హైస్కూల్‌లోని స్టాక్ పాయింట్ నుంచి పాఠశాలలకు రేషన్ పంపిణీ వావానాల(ఎండీయూ) ద్వారా పాఠ్యపుస్తకాల సరఫరాను గురువారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ రెండో సెమిస్టర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తామని చెప్పారు. బాలు ర హైస్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, సీఆర్పీలు శ్రీనివాసరావు, రెడ్డి పాల్గొన్నారు.

2,970 మంది విద్యార్థులకు..

వేపాడ: మండలంలోని ప్రభుత్వ పాఠశాలకు సెమిస్టర్-2 పాఠ్యపుస్తకాలను వాహనాల ద్వారా సరఫరా చేస్తున్నామని ఎంఈఓ-2 బాలభాస్కరరావు తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాలలోని స్టాక్ పాయింట్ నుంచి పుస్తకాల పంపిణీని గురువారం ఆయన ప్రారంభించారు. మండలంలోని 2,970 మంది విద్యార్థులకు 8,387 పుస్తకాలను ప్రభుత్వం పంపించిందని చెప్పారు. సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే పథకాలు, ప్రభుత్వ సేవలు



శృంగవరపుకోట: బొడ్డవరలో మహిళలకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు, ప్రజలకు ప్రభుత్వ సేవలు ఉచితంగా ఇంటివద్దకే అందిస్తున్నామని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, మాజీ ఎమ్మెల్యే హైమావతి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి. సూర్యనారాయణరాజు అన్నారు. ఎస్.కోట, గజపతినగరం, కొత్తవలస, లక్కవరపుకోట, బొండపల్లి, గంట్యాడ, చీపురుపల్లి, గరివిడి, గుర్ల, దత్తిరాజేరు మండలాల్లోని పలు గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ప్రజలకు రేషన్ కార్డులు, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు, ఆదాయ, కుల, జనన ధ్రువీకరణ, భూహక్కు తదితర ధ్రువపత్రాలను ప్రజలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



చీపురుపల్లి: చీపురుపల్లి సచివాలయం-3లో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటనర్సమ్మ, జెడ్పీటీసీ శిరీష



శృంగవరపుకోట: ధారపర్తిలో మహిళకు రేషన్ కార్డు అందజేస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు



కొత్తవలస: ఉత్తరాపల్లిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, నెక్కలి నాయుడుబాబు



దత్తిరాజేరు: దత్తిరాజేరులో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



బొండపల్లిలో వృద్ధురాలికి ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ చలం నాయుడు, జెడ్పీటీసీ సూర్యప్రకాశరావు



గుర్ల: గుజ్జంగివలసలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



లక్కవరపుకోట: లచ్చింపేట మహిళా రైతుకు కౌలు గుర్తింపు కార్డు అందజేస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు



చీపురుపల్లి: చీపురుపల్లి సచివాలయం-2లో ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు



గజపతినగరం రూరల్: జిన్నాంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న జెడ్పీటీసీ తవుడు



గంట్యాడ: వసాదిలో మహిళకు ధ్రువపత్రం అందజేస్తున్న ఎంపీపీ హైమావతి



చీపురుపల్లిరూరల్(గరివిడి): కోడూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు



గుర్ల: పకీరుకిట్టాలిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, నాయకులు


చక్కెర కర్మాగారాలను ఆదుకోండి



ధర్నా చేస్తున్న రైతు సంఘం నేతలు

జామి: సహకార రంగంలో ఉన్న చక్కెర కర్మాగారాలను ఆదుకోవాలని, భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆ ఫ్యాక్టరీ గేటు వద్ద గురువారం ధర్నా చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు మాట్లాడుతూ చక్కెర పరిశ్రమలను ప్రభుత్వం ఆధునికీకరించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చెరకు చెరకు పంటకు మద్దతుధరను రికవరీ శాతం ప్రకారం పెంచాలని డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్, జిల్లా కమిటీ సభ్యులు సిరిపురపు కృష్ణంనాయుడు, భీమసింగి ఫ్యాక్టరీ చెరకు రైతుల సంఘం కమిటీ కార్యదర్శి చలుమూరి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మెస్ చార్జీలు పెంచాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు, విద్యార్థులు

శృంగవరపుకోట: వసతి గృహాల్లో మెస్ చార్జీలు పెంచాలని, పర్మినెంట్ వర్కర్లను నియమించాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ కమిటీ నేతృత్వంలో గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వి. చినబాబు మాట్లాడుతూ సంక్షేమ హాస్టల్స్‌లో వసతులు మెరుగు పరచాలని, నోట్‌బుక్స్, దోమతెరలు, బ్లాంకెట్స్ ఇవ్వాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు.